


# నాకా సహాయం చాలు

మజుందార్

'వదిన' చేసిన పనిని సంఘం విరసించినా, నేను నిండుమనసుతో హర్షించాను. నా అంత రంతరాల్లో అనిపించిందేమిటంటే వదిన యీ పని యెన్నడో చేసి ఉండాల్సిందని. భర్త భార్యను వదిలివేస్తే సంఘానికి చీమ కుట్టినట్లుండదు. అదే పని ఓ భార్య చేస్తే సమాజానికి, లోకులకు కావలసినంత మేత. సంఘానికి ఎదురీతగా వెళ్ళింది వదిన. సంఘంలో బంధువుల్లో తనకు లభించే పరువుప్రతిష్టలు సమాధిచేసి వదిన వెళ్ళిపోయింది. ఎవరి సుఖం వాళ్ళు వెతుక్కునే యీ రోజుల్లో వదిన అలా వెళ్ళిపోతే సంఘం 'లేచి పోయింది' అని ముద్రవేసింది. అలా ఎందుకు 'లేచి పోయిందో' కారణాలు వెతుకుతూ తమ అసహా యత బయటపడకుండా సంతోషపడుతున్నారు లోకులు. కాని నాకు తెలుసు. నాకేగాదు మా యింటితో కాస్తోకూస్తో సంబంధమున్న అందరికీ తెలుసు...వదిన ఎందుకు 'లేచిపోయిందో.'

'మన యింటి గౌరవం మంటకలిపి వెళ్ళి పోయిం'దనే అమ్మకు కావాల్సింది నిజంగా కోడలు చేత చాకిరి చేయించుకోవటం. 'ఛీ! కులట వెళ్ళి పోయింద'నే అన్నయ్యకు కావాల్సింది అవసర మయితే వదిన దేహం. 'ఎరగకపోయి పాడు సంబంధం' చేసుకున్నాం అనే నాన్నకు కావలసినది వదిన సుఖంకాదు...తనకు సమయానికి అన్నీ అమర్చటం. కాని వదిన...నేను తల్లిలా ప్రేమిం చిన వదిన వెళ్ళిపోయిందంటే నేను విచారించే బదులు సంతోషించేను. కారణం నాకు తెలుసు. ఈ పాడుకొంప వదిలి వెళ్ళేవారెవరయినా సుఖ పడ్తారు. అది ఆలశ్యంగా గ్రహించినా వదిన వెళ్ళి పోయింది.

మాది అవిభక్త ఉమ్మడికుటుంబం. ఒకప్పుడు మా తాత ముత్తాతలు అగ్రహారాలు సంపాదించి సుఖంగా కాలక్షేపం చేసేరు. ఆ వరవడే మా నాన్న వరకు వచ్చింది. ఎంత కొండయినా త్రవ్వటం ప్రారంభిస్తే తరగక మానదు ... అలాగే ఉన్న దంతా హరించుకుపోయినా యింట్లో మనుషుల డాంబికాలకు లోపమేమిలేదు. అన్నయ్య చదివి నంతవరకు చదివి మా వూరి స్కూల్లోనే 'మేష్టరు'గా చేరేడు. ఆస్థి కరిగి పోతున్నది. ఇంట్లో పూజలకు సంతర్పణలకు లోపమేమిలేదు. అన్నయ్య వంశ పారంపర్యంగావస్తున్న వ్యసనాలకు దాసుడు. నేను చిన్నవాడ్ని. ఆ వూరుస్కూల్లోనే చదువుకుంటున్నాను.

ఇంట్లో పరిస్థితి యిలా ఉన్నప్పుడు యింటికి 'పెద్ద కోడలు' హోదాతో వచ్చింది వదిన. మా యింటికి రాకముందు ఏదన్నా సుఖపడితే..అంతే! మాయింట ఏక్షణాన అడుగుపెట్టిందోగాని త్వరలో మాత్రం తను 'పెద్ద కోడలుకాదు పెద్ద పనిమనిషి' అన్న విషయం గ్రహించే వుంటుంది.

నాకు చిన్నప్పటినుంచి ఎవరిదగ్గరా చనువులేదు. నాన్న దగ్గరకు పోయేవాడిని కాదు. అన్నయ్యంటే భయం ... అమ్మంటే కోపం ... నా జీవితంలో అప్పుడు ఓ వ్యక్తి ప్రవేశించింది. ప్రేమ, ఆదా రణ ఆప్యాయత పంచి యిచ్చింది. ఆ వ్యక్తే వదిన.

కన్నవారిని విడిచి ఎలా సుఖపడాలని వచ్చిందో వదినకు అదే కరువయింది. అన్నయ్య బాగా చూడడు...చూడలేదు. అన్నయ్యకు బజారు స్త్రీల్ల వద్దదొరికే క్షణికానందాలు వదిన యివ్వలేదు. భర్త నుంచి అనురాగం ఆశించింది కాని. లభ్యమయింది తిట్లూ దెబ్బలు. అత్తగారి నుంచి ఆదరణ ఆశిం చింది కాని అందుకున్నది సూటిపోటి మాటలూ, నిందలూ.

వదిన యింట్లో వాళ్ళు పెట్టే బాధలు భరించ లేక నాదగ్గర చెప్పుకుని కంట తడిపెట్టుకునేది. నేనేం చేయగలను? చిన్నవాడిని. తొందరగా పెద్ద వాడినయిపోతే బాగుండు-వదినను కష్టపెట్టకుండ చూడవచ్చు అనుకుంటూండే వాడిని. వచ్చే జన్మ కయినా ఆదరణ, అప్యాయతా పంచిపెట్టే వదిన 'తల్లి' కావాలని కోరుకునేవాడిని.

వదినకు ఖాళీగా వున్న సమయం నే చూడలేదు. కోడి కూయకుండానే లేవటం నుంచి - వంటింటి తలుపులు వేసేదాక వంచిన నడుము ఎత్తకుండా చేసేది. స్కూలుకు వెళ్ళే మాకు అన్నీ అమర్చి పెట్టడం, నాన్నగారి పూజకు అమర్చటం...అమ్మకు కాళ్ళొత్తటం అన్నీ తనే చేసేది. ఇంత చేసినా

భర్తనుంచి ఆపరణగా ఒక్కమాట లభిస్తే మురిసిపోయేది. కాని అదే కరువయింది ఆ యింటిలో వదినకు. గానుగెద్దులా పని చేసినా అమ్మ సాధింపులు తప్పవు. నాన్నగారి విసుగుకోపాలుతప్పవు. అన్నయ్య దెబ్బలూ తప్పవు.

వదిన కొత్త మంచి గుడ్డలు కట్టుకుంటే తప్పు. తలనువ్వుకుంటే తప్పు. పరాయివాళ్ళతో మాట్లాడితే తప్పు. యిల్లు దాటి బయటకు వెళ్తే తప్పు... అన్నీ భూదేవిలా భరించింది ...

... ఒకనాడు నాకు బాగా గుర్తువుంది. నేనూ అన్నయ్య సాయంత్రం స్కూలు విడిచేక యింటికి వస్తున్నాం. గుమ్మంలో వదిన తెల్లని జరీచీర కట్టుకుని, కళ్ళకు నల్లని కాటుకతో, పెద్దజడతో, అపర లక్ష్మిదేవిలా నిల్చుంది. మమ్మలని చూస్తూనే వదిన కళ్ళు సంతోషంతో మెరిసేయి. కాని అవి అలా ఎంతోసేపు ఉండలేదు.

అన్నయ్య వదినవైపు పరీక్షగా చూసి "ఏం, వస్తానన్నవాళ్ళు ఎవరూ రాలేదా ?" అన్నాడు. నాకా మాటలకు అర్ధం అప్పుడు బోధపడకపోయినా వదిన వదనం చిన్నబోవటం గమనించేను.

"నేను మీ కోసమే నిల్చున్నాను" అంది బొంగురు గొంతుకతో.

"ఏమోలే. భోగంసాపలా సింగారించుకుంటేను" అన్నయ్య వంకరగా నవ్వేడు. వదిన కళ్ళలో నీళ్లు తిరిగేయి.

లోపలికి వచ్చేక అన్నయ్య కాళ్ళకు నమస్కరించింది వదినే. ఇది పెళ్ళిలో చూడటమే. మళ్ళా చూడలేదు.

"అరెరె ! ఏమిటీ ? యివాళ ఎన్నడూలేని పతిభక్తి -" అన్నయ్య కు వదినను చూస్తేనే 'వ్యంగ్యం' దొర్లుతుంది.

"ఇవాళ నా పుట్టినరోజు" అంది వదిన నవ్వుతూ. నా కలావున్న వదినను ఎంత సేపయినా చూడాలనిపించింది.

"అలా చెప్పు ! నాకు నమస్కారాలు అవీ వద్దుగాని...కొత్త సంసార మనిషిలా వుండేచాలు..." అన్నాడు స్నానానికిలేస్తూ. వదిన గదిలోదూరి నోట్లో గుడ్డను కుక్కుకుని ఏడవటం చూసేను. ఆ యింట్లో వదిన పెద్దగా ఏడవటానికి గూడా లేదు. స్నానం, భోజనంచేసి భుజాన కండువా వేసుకుని తెల్లగుడ్డలమీద "సెంటు" వ్రాసుకొని వెడుతున్న "అన్నయ్య" కేసి నిస్పృహాయంగా చూసేది...

...ఆరోజు మామూలుగా పాలమనిషి వచ్చి తలుపు తట్టాడు. ఎప్పటిలా వదిన లేవకపోవటం చూసి "అమ్మే" విసుగుకుంటూ లేచి వెళ్ళి పాలు బట్టింది. నేను ప్రొద్దున్నే లేచేసరికి యింటిలో పెద్ద గొడవగావుంది. అందరిండ్లకు కబురుపెట్టి వదిన ఎటో వెళ్ళిపోయిందని తేల్చారు. ఎందుకు, ఎలా వెళ్ళిపోయిందో తెలియకపోయినా వెళ్ళిపోయినందుకుమాత్రం సంతోషించేను. కొన్నాళ్ళవరకు "పుట్టింటి"కి వెళ్ళిందని లోకులను సమాధాన పరిచినా తరువాత "వంశగౌరవం మంటకలిపి లేచిపోయింది ముదనష్టపుది" అని ప్రచారం చేసేరు.

వదిన వెళ్ళిపోయాక చాలా మార్పులను తీసుకు వచ్చింది కాలం. అన్నయ్య మళ్ళీ పెళ్ళిచేసుకోవటం. నేను చదువు ముగించుకుని హైదరాబాదులో ఉద్యోగంలో చేరటం లాటివి జరిగిపోయాయి.

ఈ మధ్యకాలంలో "వదిన" విషయం అంతా మరిచిపోయేరు. లేదా మరిచిపోయినట్లు ఎవరికి వారు అనుకునేవారు. నేనూ పూర్తిగా మరిచిపోకపోయినా వదినను మళ్ళీ ఎప్పుడయినా కలుసుకోవాలి అన్న కోర్కెమాత్రం బలీయమవుతూ వచ్చింది.

కాని యివాళ వచ్చిన ఉత్తరం పాతజ్ఞాపకా-




ఒక సహధర్మచారిణి రోజూ పుట్టింటికి వెళ్ళిపోతానని భర్తను బెదిరించటం మొదలు పెట్టింది. చివరకు విసిగెత్తిపోయి భర్త ఒక రోజున "పోతేపో" అన్నాడు.

"మీరన్నప్రకారం చస్తేచెయ్యను. అంతా మీ ఇష్టమేనేమిటి. మీరు పొమ్మంటే ఖచ్చితంగా ఇంట్లోకివచ్చి తిష్టవేసుక్కూచుంటాను" అంది ఆవిడ తిరిగివచ్చేస్తూ.

"అయితే నా బంగారుచిట్టీ రా ఇంట్లోకి" అన్నాడా లౌక్యంగల పెద్దమనిషి.

పాపం అర్ధాంగి !

లను రేపింది. ఇంటి చాకిరిచేస్తూ శోకదేవతలా వున్న "వదిన" కళ్ళముందు మెదిలింది.

వదిన గురించి కబురుగాని. వదిన విషయం తెలిసిగాని ఎన్నో సంవత్సరాలయింది. యిన్నాళ్టికి తనంతట తాను ఉత్తరం వ్రాసింది.

చెబుతున్నది ఆపి రమ కళ్ళల్లోకి చూసేను. రమ ఉషను సరిగా పడుకోబెట్టి జోకొడుతున్నది.. బొంగురుపోయే గొంతుకతో "ఏమని వ్రాసింది ?" అని ప్రశ్నించింది. నేను నిశ్శబ్దంగా లేచి వెళ్ళి లాల్చీ జేబులోని ఉత్తరం తెచ్చి యిచ్చేను.

"మీరే చదవండి" అంది.

మీదున్న దువ్వాలుతో ముఖం తుడుచుకొని చదవటం ప్రారంభించేను.

చిరంజీవి శేషుకు,

బహుశః నీకు ఒక దైవోపహతురాలైన వదిన వుందని గుర్తుండక పోవచ్చు...కాని 'శేషు' అనే తమ్ముడులాటి మరిది ఉన్నాడని మాత్రం యీ జీవితంలో మరిచిపోలేను.

నీకు గుర్తుందా శేషూ ! నేను పరమ చిత్తశోభ. ఏ పరిస్థితుల్లో యింటిలోంచి వెళ్ళిపోవలసివచ్చిందో నీకు తెలుసనుకుంటాను. పదేళ్ళ తరువాత ఏ ముఖం పెట్టుకుని నాకు ఉత్తరం వ్రాస్తున్నదీ సిగ్గులేని మనిషి అని నీవు అనుకుంటే యిక నేను చేయగలిగిందేమీ లేదు. అలా నిజంగా నీవు అనుకుంటే యీ ఉత్తరం యింక చదవకు... చింపెయ్యి.

ఎవరు నా గురించి ఏమనుకున్నా నన్ను యింట్లో వ్యక్తిగా పరిగణించకపోయినా నీవు నాకు మరిదివే శేషూ. నేను నీకు వదిననే. నీకు ఏమి తెలియని పసితనంలో నీదగ్గర నా బాధలు చెప్పుకుని మనశ్శాంతి పొందేదాన్ని. యిప్పుడూ అంతే. పెద్దవాడివయ్యావ్. అర్ధంచేసుకుంటావనే ఉద్దేశ్యంతో యీ ఉత్తరం వ్రాస్తున్నాను.

నేను పుట్టింట్లో ఏమి సుఖపడ్డానో తెలియదుగాని మెట్టినింట్లో ఏం సుఖపడ్డానో నీకు తెలుసు. ఒకొక్కరి జీవితాలు అంతే శేషూ. దేవుడు మాలోటి వాళ్ళకు కష్టాలనుభవించటంలో సుఖం పెడ్తాడు. పెళ్ళికి ముందు సంసారం గురించి కట్టుకున్న ఆశలన్నీ గాలి మేడలయిపోయాయి.

నీకు గుర్తుందా శేషూ ! నేను ఎప్పుడు యింటిలోంచి వెళ్ళిపోయానో ? చుట్టపుచూపుగా యింటికి నన్ను చూడటానికి వచ్చిన మా బావకు నాకూ సంబంధం అంటగట్టి 'కులటా' అని అరుస్తూ మీ అన్నయ్య కొడుతుంటే నిశ్శబ్దంగా వద్దాను. ఏరోజు అయితే నన్ను 'కులట' అని పిలిచారో నాకి మనుషుల మీద, మనిషి జన్మమీదే అసహ్యం వేసిపోయింది. అందుకే మరునాడు వెళ్ళిపోయాను ఈ మనుషులకు. యీ లోకానికి దూరంగా పోదామని.

కాని శేషూ ... నన్ను నమ్ము ... నీ వదిన ఏ అపకీర్తి తెచ్చిపెట్టే పని చేయలేదు. నేను సంఘం అనుకున్నంత దీనస్థితికి దిగజారి పోలేదు. అందుకే ఆ ఆత్మ విశ్వాసంతోనే ధైర్యంగా నీకీనాడు ఉత్తరం వ్రాయగలుగుతున్నాను.

ఆరోజు చచ్చిపోయినా బాగుండేదేమో. కాని ఓ పుణ్యాత్మురాలు నేను చచ్చిపోకుండా చేసింది. నేనూ నా కడుపులో పెరుగుతున్న పాపను చంపే అధికారం నాకు లేదని తెలుసుకొని ఆమె మాటలకు లొంగిపోయి ఆమె వెంట మౌనంగా వెళ్లేను. ఎలా బ్రతికేమోయిన్నేళ్లు.వ్రాసి నిన్ను బాధపెట్టడం నా అభిమతంగాదు. దేవుడిచ్చిన రెక్కలతో బ్రతికేము. అలాగే కొంతకాలం గడిచింది. ఆ మునలామె చచ్చిపోయింది నన్ను మళ్ళీ ఒంటరిదాన్ని చేసి. నాకు నా'లక్ష్మి' తోడు. లక్ష్మికి నేను తోడు. "లక్ష్మి"మీద ఆశలన్ని పెట్టుకుని బ్రతికేము. నేను

కష్టపడి దానికి చదువు చెప్పించేదాన్ని. కాని. భగవంతుడు మళ్ళీ చిన్నచూపు చూసేడు. నాకు క్షయ ప్రసాదించేడు. ఈ పరిస్థితులలో 'లక్ష్మి' నా దగ్గరుండటం నాకిష్టంలేదు. ఇష్టమున్నా నేను చేయగలిగిందేమీ లేదు.

నా 'లక్ష్మి' నాలా కాకుండా చదువుకోవాలి. చదువుకుని అది 'డాక్టరు' కావాలి. ఇదే శేషూ నా కోరిక. 'లక్ష్మికి' నాన్న ఉన్నాడని గాని ఫలానా చోట వున్నారని ఎప్పుడూ చెప్పలేదు. లక్ష్మి చదువుకోవాలి సంఘంలో గౌరవంగా బ్రతకాలి... దాని జీవితం నాలా చింపిన విస్తరి కాకూడదు.

అందుకే శేషూ నీకు వ్రాస్తున్నది. నాకు ఎలాగూ సంఘం 'లేచిపోయిన స్త్రీ' అని ముద్రవేసింది. అలాటి వాళ్ళకు, వాళ్ళ పిల్లలకు సంఘంలో ఏమాత్రం గౌరవం లభిస్తోందో నాకు తెలుసు. అందుకే నా కూతురును చేరదీసి నీ పిల్లల భవిష్యత్తు పాడుచేసుకోమని ఎలా అనగలను?

నీకు వీలయితేనే ... నీ అన్నయ్య కూతురుగా కాదు ... నిన్ను ప్రేమించే 'వదిన' కూతురుగా గాదు ... ఒక అనాథగా చేరదియ్యి. అదే చాలు. ఎలాగయినా దాన్ని చదివించు శేషూ. 'లక్ష్మి' ని నువ్వుకూడ కాదంటే దానికి అనాథాశ్రయంలోనే చోటు. తండ్రీ తాతలూ ఉన్న 'లక్ష్మి' అనాథ ఎలా అవుతుందని నేననుకోలేదు. నా కడుపున పుట్టినందుకు అదీ అనుభవించాల్సిందే అనుకుంటాను.

అది యిష్టంలేకనే శేషూ నీకు వ్రాస్తున్నది. "లక్ష్మి"ని తీసుకువెళ్ళి "పనిమనిషి"గా నయినా సరే చూసుకుని చదివించు. అది చదువుకోవాలి. నీలాటి మంచివాళ్ళ దగ్గర అది పెరగాలి. నీవు దాన్ని చేరదీయగలిగితే శేషూ! నీ సహాయం జన్మజన్మలకు మరిచిపోను. నాకా సహాయం చాలు శేషూ! నీ ఉపకారం మరో జన్మకయినా తీర్చుకుంటాను.

నాకు నమ్మకముంది, నీవీ సహాయం చేస్తావ్. చెల్లాయి యిష్టంకూడా కనుక్కోవటం మాత్రం మరువకు.

నీ రాకకోసం, ఆ పయిన దేవుని పిలుపుకోసం ఎదురుచూస్తున్నాను. ఎక్కడ ఉంటున్నానో అడ్రసు క్రింద యిచ్చేను.

ఆశీర్వచనములతో,

అభాగ్యశాలి,
నీ
వదిన.

మసక మసకగా కనబడుతున్న ఉత్తరం చదవటం పూర్తిచేసి 'రమ' వైపుచూసేను. రమ పమిట చెంగుతో అటు తిరిగి కళ్ళొత్తుకుంటున్నది. గదిలో నిశ్శబ్దం కదులుతున్నది. 'ఉష'ను సరిగా పడుకోబెట్టి దుప్పటి కప్పింది. నేను 'రమ' నోటినుంచి వచ్చే మాటలకోసం ఎదురు చూస్తున్నాను. ఒక నిముషం నిశ్శబ్దంగా కాలం దొర్లిపోయింది. ఉష మొఖంలోకి చూస్తూ అంది రమ. "అయితే యిక నుంచి నాకు యిద్దరు పిల్లలన్నమాట."

★

# వేగుచుక్కలు

ఉర్దూ : మఖ్దూం మొహియుద్దీన్

తెలుగు : గజ్జల మల్లారెడ్డి

స్వాతంత్ర్యాధ్వర మహోగ్రకీలల
సమిధలయ్యె మృతవీరుల తనువులు
వేగుజుక్కలై నవోదయానికి
వెలుగుబాటలను తీరిచిదిద్దిరి

బాధల గోడలమాదిరి తోచును
కళపెళ ధమనుల కాగేనెత్తురు
కవోష్ణ రక్తస్రవంతులయ్యెను
కొందరు వంచక మహానాయకులు!
కుబుసం విడిచిన కృూరసర్పముల
పూత్కారంలా నిశ్వాసింతురు
వారి ఎదలలో తీరనిద్వేషపు
హాలాహల ధూమచ్ఛటలుండును
పొంచి పొంచి విష రసనాగ్రమ్ముల
పెంచి నవోదయ కాంతిపుంజముల
స్వాహాచేసే స్వార్థోన్మత్తులు



తీరనివప్పిక ముప్పిరిగొన్నా
తృప్తిపున్నదా తృష్ణలోపలే
ఇంకినకన్నుల ఎండినగుండెల
ఎదురుచూచు నరనారీ నివహం
ఎప్పుడు నవవాసంత విలాసం?
ఎప్పుడు ధీరసమీర విహారం?
ఉత్సవాల సంరంభం శూన్యం
ఉన్మత్తానందం పూజ్యం
రాత్రులు ధగధగ సెగడుల వోలెను
రగిలి జ్వలించే దేహాలన్నీ
ప్రాతః కాంతుల పరిశీలిస్తే

పదండి కామ్రేడ్స్! పదండి ముందుకు
అంధనిశలలో ఉషఃకాంతిలో
చేయీచేయీకలిపి గమ్యమును
చేరేటందుకు పదండిముందుకు!
ప్రణయమందిరం వెలసినచోటికి
పథ్యాశిలలు తలయెత్తినచోటికి
వలపుల నెచ్చెలివుండే వీధికి
భుజస్కంధముల మీ మీ సిలువలు
మోసుక దూసుకపదండి ముందుకు
పదండి కామ్రేడ్స్! పదండిముందుకు!
మూలం : 'చాంద్ తారోంకా బన్'